క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

సాలూరు: విద్యుత్ మెయింటనెన్స్ పనుల నేపథ్యంలో శుక్రవారం సాలూరు పట్టణం, మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. సాలూరు ఓల్డ్ సబ్‌స్టేషన్ 33/11 కేవీ పరిధిలో గల పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

గోశాలల బిల్లులకు నివేదికలు

సీతానగరం: మండలంలో గోశాలల నిర్వాహకులకు బిల్లులు చెల్లించడానికి నివేదికలు పంపించామని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ, గ్రామాభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా బుధవారం గాదెలవలస, జానుమల్లువలస గ్రామాల్లో జరుగుతున్న గోశాలల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో రెండు విడతల్లో 111 గోశాలలను మంజూరు చేశామని చెప్పారు. నిర్మాణాలు పూర్తయి బిల్లుల కోసం ఇబ్బందులు పడుతున్న కారణంగా లబ్ధిదారులకు త్వరలోనే బిల్లులు చెల్లిస్తామన్నారు. అనంతరం ఉపాధిహామీ పనులు, వేతన దారుల మస్తరును పరిశీలించారు.

కంప్యూటర్ సామగ్రి వితరణ



యూబీఐ వితరణ చేసిన కంప్యూటర్ సామగ్రిని స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ.లక్ష విలువైన కలర్, బ్లాక్ అండ్ వైట్ ప్రింటర్లు, స్కానర్లను వితరణ చేసినట్లు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో యూబీఐ ప్రాంతీయ కార్యాలయం అధికారుల నుంచి ఆయన కంప్యూటర్ సామగ్రిని స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూబీఐ అందించిన కంప్యూటర్ సామగ్రిని ఐటీడీఏ పరిధిలోని వసతిగృహాలలో వినియోగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బెలగాం యూబీఐ బ్రాంచ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మవారి జాతర



అంగడి నుంచి వనం గుడికి అమ్మవారి ఘటాలతో సాగనంపుతున్న కమిటీ సభ్యులు

సీతానగరం: మండలంలోని తామరఖండిలో పెద్దమ్మవారి జాతరను పురస్కరించుకుని బుధవారం అనుపోత్సవం ఘనంగా జరిగింది. వారం రోజులుగా జరుగుతున్న అమ్మవారి ఉత్సవాల్లో ఘటాలతో వనంగుడి వరకూ మేళతాళాలతో ఊరేగింపుగా భక్తులు వెళ్లి మొక్కులు తీర్చుకుని అమ్మవారిని సాగనంపారు. రెండేళ్లకో పర్యాయం గ్రామస్తులు తెచ్చే పెద్దమ్మవారి జాతరకు వేలాదిమంది భక్తులు దూర ప్రాంతాలనుంచి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



శివరాంపురం వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరం

సాలూరు రూరల్: మండలంలోని శివరాంపురం వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ మార్గదర్శకాల ప్రకారం సహకార సంఘాల సామాజిక సేవలో భాగంగా శివరాంపురం సహకార సంఘం ఆరోగ్య శిబిరం నిర్వహించింది. మిమ్స్ హస్పిటల్ నెలిమర్ల వైద్య బృందం ఈ వైద్యబిరంలో వైద్య సేవలు అందించారు. రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ విజయనగరం సీఈఓ ఉమామహేశ్వరరావు, సూపరింటెండెంట్ రమణమూర్తి పాల్గొన్నారు.

ఆరోగ్యానికి రక్ష ఓఆర్‌ఎస్

- తీవ్రమైన ఎండల నుంచి ఉపశమనం
- ఇంట్లో తయారీ ఇంకా మంచిది



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు

బలిజిపేట:

మండుతున్న ఎండల తీవ్రతను తట్టుకునేందుకు, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా ఉంచుకునేందుకు వేసవిలో ప్రతిఒక్కరూ వైద్యుల సూచన పాటించడం అవసవరం. సాధారణం కంటే అధికస్థాయిలో ఉష్ణోగ్రతలు, వడగాలులు ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) స్పష్టం చేసిన విషయం విదితమే. సాధారణంగా ఏప్రిల్ నుంచి జూన్ మధ్యలో వడగాడ్పులు కొన్ని రోజులు ఉంటాయి. ఈ ఏడాది వాటి ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఇప్పటికే ఉక్కపోత పెరిగింది. శ్రామిక, ఉద్యోగ, వ్యాపారులు విధి నిర్వహణలో భాగంగా అనివార్య పరిస్థితుల్లో మండే ఎండల్లో తిరగక తప్పదు.

• పనులకు వెళ్లేవారు

ఉపాధి పనులు, ఇతరత్రా వ్యవసాయ పనులకు వెళ్లేవారు ఎక్కువగా ఉంటారు. ముఖ్యంగా మండుటెండలో కట్టుపనితో సహా మరికొన్ని రకాల పనులు చేయాల్సి వస్తుంది. అటువంటి వారు ఎండ ప్రభావానికి లోనుకాకుండా తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి.

• ఓఆర్‌ఎస్ తయారీ ఇలా

ఓఆర్‌ఎస్ అనేది వివిధ లవణాల మిశ్రమంతో కూడిన 20.5గ్రాముల పొడర్ ప్యాకెట్. దీనిలో 2.6గ్రాముల సోడియం క్లోరైడ్, 1.5గ్రాముల పోటాషియం క్లోరైడ్, 2.9గ్రాముల సోడియం సిట్రేట్, 13.5గ్రాముల డెక్స్‌ట్రోజ్ ఉంటాయి. ఈ పొడర్ ప్యాకెట్‌ను సురక్షితమైన లీటరు నీటిలో కలిపి రోజు మొత్తంలో వయస్సును బట్టి తగిన మోతాదులో తాగాలి. మితిమీరిన మోతాదులో తాగడమూ అనర్థాలు తెచ్చిపెడుతుంది.

వడదెబ్బ తగిలే అవకాశం

శరీరంలో సహజంగా నీటిశాతం తగ్గిపోవడంతో వడదెబ్బకు గురవుతుంటారు. ఇలాంటి ప్రమాదానికి గురికాకుండా ఉండేందుకు ఓఆర్‌ఎస్ ద్రావణం ఉపకరిస్తుందని వైద్యులు చెబుతున్నారు. స్థలం, కాలాన్ని బట్టి శరీరాన్ని నిర్దేశించిన ఉష్ణోగ్రతలో ఉంచుకోవాలి. మెదడులో హైపోతలామస్ అనే భాగం శరీరంలోని వేడిని క్రమబద్ధీకరిస్తుంది. తగిన నీటిని తాగకపోయినా, ఎండలో ఎక్కువ తిరిగినా హైపోతలామస్ భాగమే అధిక ఉష్ణోగ్రతకు లోనై క్రమబద్ధీకరించే పని చేయలేదు. ఈ స్థితిలో తల తిరగడం, నీరసం, నిస్సత్తువ, తలనొప్పి, జ్వరం, చీకటి కమ్మినట్లు అనిపించడం, వాంతి అవుతున్న భావన కలగడం వంటి లక్షణాలు వడదెబ్బకు గురైనట్లు నిర్ధారిస్తాయి.



డీహైడ్రేషన్ తగ్గిస్తుంది



వడదెబ్బ బారిన పడిన వారు డీ హైడ్రేషన్‌కు గురవుతారు. అటువంటి సమయంలో ముందుగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌ను వినియోగించడం వల్ల కొంతవరకు కోలుకుంటారు. ఓఆర్‌ఎస్‌లో అన్ని రకాల మినరల్స్ ఉంటాయి. అవసరమైనవారు తీసుకోవచ్చు.

– బి.క్రాంతి కిరణ్మయి, వైద్యాధికారిణి, బలిజిపేట పీహెచ్‌సీ

ప్రభుత్వ హాస్పిటల్స్, వైద్య ఆరోగ్య కార్యకర్తల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయి. సమయానికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్ అందుబాటులో లేకపోతే ఇంటిలోనే ఉప్పు, పంచదార, నీరు సాయంతో ఈ ద్రావణాన్ని తయారుచేసుకోవచ్చు. లీటరు నీటిలో చిటికెడు ఉప్పు, చారెడు(అరస్పూన్) పంచదారను కలిపి తాగవచ్చు. ఎండ తీవ్రతకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించడం అవసరం.

అన్ని గ్రామాలకు ఉపాధిపనులు కల్పించండి



ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న సీపీఎం నాయకులు

బలిజిపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎన్ఎంఎంఎస్ యాప్ రద్దు చేయాలని, ఒక్క పూట ఉపాధి పని పెట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ నగేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి కేంద్రప్రభుత్వం తూట్లు పొడిచిందని ఆరోపించారు. పనుల ప్రదేశంలో మౌలిక సదుపాయాల కల్పన లేదని, ఎన్ఎంఎంఎస్ యాప్‌తో ఉపాధి కూలీలకు నరకం చూపిస్తున్నారన్నారు. వడగాడ్పులు తీవ్రంగా ఉంటే రెండు పూటలా పని పెట్టడం దారుణమని, వ్యవసాయ పనులు కుంటు పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు వారి సొంతపనులు చేసుకోలేని స్థితిలో ఉన్నారని, కూటమి ప్రభుత్వంలో ఒక్కపూట ఉపాధిపని పెడతామని చెప్పినవారు ఇప్పుడు వారికి నరకం చూపిస్తూ, రెండుపూటలా పనులు పెట్టడం దారుణమన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ నగేష్‌కు అందించారు. కార్యక్రమంలో పి.వెంకటస్వామి, ఎస్.ఈశ్వరరావు, వై.మన్మథరావు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు

బలిజిపేట: రానున్న ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు తగు ప్రణాళికలను తయారుచేసుకోవాలని ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు తెలిపారు. ఈ మేరకు రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికా సమావేశాన్ని వెలుగు, ఎన్ఆర్‌ఈజీఎస్, ప్రకృతి వ్యవసాయశాఖలతో సమన్వయ సమావేశం బుధవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు మాట్లాడుతూ వివిధ శాఖల సమన్వయంతో ప్రకృతి వ్యవసాయం అలవాటు చేస్తూ రైతులకు నికరఆదాయం సమకూరేలా చేయాలని కోరారు. ఎన్ఎఫ్ఏ తిరుపతిరావు మాట్లాడుతూ నవధాన్యాల సాగు పద్ధతుల గురించి వివరించారు. వివిధ శాఖలకు చెందినవారు వారి వివరాలను తెలియపరిచారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

బంధం జగనన్నతో అనుబంధం రాజన్నతో..



రాజన్నదొరను కలిసిన సాలూరు మండల గిరిశిఖర పంచాయతీల నాయకులు, కార్యకర్తలు

- స్పష్టం చేసిన గిరిశిఖర గ్రామాల నాయకులు, ప్రజలు

సాలూరు: మా బంధం మాజీ ముఖ్యమంత్రి జగనన్నతోను..మా అనుబంధం మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరతోనని సాలూరు మండలం గిరిశిఖర గ్రామాల నాయకులు, ప్రజలు స్పష్టంచేశారు. ఈ మేరకు బుధవారం సాలూరు మండల గిరిశిఖర గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరను పట్టణంలోని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా కూటమి పాలనలో గిరిజనులు పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పోడుపట్టాలు, అనేక సంక్షేమ పథకాలు, వందల కోట్లతో అభివృద్ధి పనుల ద్వారా గిరిజనులకు ఎంతో మేలు చేశారన్నారు. నేటి కూటమి ప్రభుత్వంలో ఎటువంటి పథకాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. మమ్మల్ని ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టినా మేమంతా జగనన్న, రాజన్నల వెంటే ఉంటామని పునరుద్ఘాటించారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ, ఈ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలతో పాటు, 2014–19 మధ్య టీడీపీ పాలనలో అమలు చేసిన పథకాలను అమలుచేస్తామని ఎన్నికల ముందు హామీలను ముందు ఇచ్చారని, నేడు ఆ హామిలు విస్మరించారని విమర్శించారు. ఎవరూ అధైర్యపడవద్దని తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అఖండ మెజారిటీతో గెలవడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

డిప్యూటీ సీఎం రోడ్డు శంకుస్థాపన చేసినా..

ప్రస్తుత ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గతేడాది సాలూరు మండలంలోని కొదమ ప్రాంత రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా నేటికీ పనులు ముందుకు సాగడం లేదని వాపోయారు. ముఖ్యంగా గిరిశిఖర గ్రామాల్లో గత ప్రభుత్వంలో మంజూరుచేసిన రోడ్లను కూటమి పాలనలో ఎందుకు పూర్తిచేసే దిశగా అడుగులు పడడం లేదో అర్థం కావడం లేదని, వాటిని పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, ముచ్చల ఆదయ్య, చోడిపల్లి బీసు, నెమలిపిట్ట కల్యాణ్, రఘుపాత్రుని సాంబమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడుతున్న ఎంఈఓ–1సామల

బలిజిపేట: రానున్న విద్యాసంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఎంఈఓ–1సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు బలిజిపేట ఎంఆర్‌సీలో ఉపాధ్యాయ సంఘాలతో కోఆర్డినేషన్ సమావేశాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారికి సంబంధించిన వృత్తిపరమైన అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించ నున్నట్లు తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలో మార్పులు చాలా ఉన్నాయని, అందుకు అనుగుణంగా పాఠశాలలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలో 14మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో అడ్మిషన్స్ నిమిత్తం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి విద్యార్థులను చేర్పించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులపై దృష్టి సారించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కృషిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాది మృతి



న్యాయవాది ఆర్‌వీరమణ (ఫైల్)

సీతానగరం: మండల కేంద్రంలోని సుంకరివీధికి చెందిన న్యాయవాది రాంబార్కి (ఆర్‌వీఆర్) వెంకటరమణ విశాఖలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. సామాన్య కుటుంబంలో జన్మించిన వెంకటరమణ చిన్నవయస్సు నుంచే పేదవారికి తనవంతు సహకారం అందించి, సామాజిక సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. బొబ్బిలి కోర్టులో న్యాయవాద వృత్తిని చేపట్టి పలువురికి సేవలందించారు. కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురైన న్యాయవాది వెంకటరమణను కుటుంబసభ్యులు విశాఖ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ మేరకు బొబ్బిలి బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సహచర న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు వెంకటరమణ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. న్యాయవాది వెంకటరమణకు భార్య, కుమారుడు ఉన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారణపై దృష్టి సారించాలి

- జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్‌మోహన్



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహన్ రావు

పార్వతీపురం రూరల్: సురక్షిత ప్రసవమే ధ్యేయంగా గర్భిణులకు వైద్యసేవలు అందజేయాలని వైద్యారోగ్యశాఖ పార్వతీపురం మన్యం జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన రావు పేర్కొన్నారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని బందలుప్పి, డోకిశీల, పెదబొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పీఎంఎస్ఎంఏ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించిన ఆయన ఈ కేంద్రాలను తనిఖీ చేశారు. గర్భిణులకు నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షలు, వాటి నివేదికల రికార్డులు, ఎంసీపీ కార్డుల్లో పరిశీలించారు. హిమోగ్లోబిన్ శాతం కొంత మంది గర్భిణుల్లో వృద్ధి చెందకపోవడాన్ని గమనించి అందుకు గల కారణాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పీహెచ్‌సీలో తాగునీటి లభ్యతను పరిశీలించారు. వైద్యాధికారులు ఎప్పటికప్పుడు వైద్య సిబ్బందితో సమీక్షించి రక్తహీనత, హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యం మెరుగుకు కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ఎస్ఎంకే.తిరుమలప్రసాద్, డా.ఐశ్వర్య, డా.ధరణి, సూపర్‌వైజర్లు శ్రీరాములునాయుడు, సత్తిబాబు, శ్రీను, జయ లక్ష్మి, ఎస్.జయ, శంకర్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో పైప్‌లైన్‌కు మరమ్మతులు



రోడ్డు పక్కనే పాతిన విద్యుత్‌స్తంభాలు



స్తంభాలు పాతినప్పుడు విరిగిన పైప్‌లైన్ ముక్కలు

బలిజిపేట: విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతో బలిజిపేట మండలంలోని గంగాడ రక్షిత మంచినీటి పథకం పైప్‌లైను మరమ్మతుల బారిన పడింది. వంతరాం సబ్‌స్టేషన్ నుంచి వేస్తున్న కొత్త విద్యుత్ స్తంభాలు రక్షిత మంచినీటి పథకం పైపులైన్‌పై వేయడంతో సమస్యలు ఎదురయ్యాయి. కొత్త విద్యుత్ స్తంభాలు వేసేందుకు తవ్వేన గుమ్ముల వల్ల భూమిలో ఉన్న రక్షిత మంచినీటి పథకం పైప్‌లైన్ ముక్కలై పాడైనట్లు గుర్తించారు. దీంతో నీటి సరఫరాకు అంతరాయం కలిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. పథకం పనిచేసేందుకు మరమ్మతులు చేపడుతున్న సమయంలో ఈ విషయం గుర్తించినట్టు అధికారులు తెలిపారు. ఆర్‌వీఎస్ఎస్ స్కీంలో వంతరాం సబ్‌స్టేషన్ నుంచి కె.గలావల్లి వరకు 24గంటల విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు విద్యుత్ స్తంభాలను పాతుతున్నారు. ఈ పనిలో భాగంగా 50మీటర్లకు ఒక స్తంభం చొప్పున ఇప్పటికే 30 స్తంభాలకు పైగా వేశారు. ఈ పనులు చేస్తున్న సందర్భంగా పైపులైన్ మరమ్మతులకు గురైంది. సుమారు 2కిలోమీటర్ల పొడవునా విద్యుత్ స్తంభాలు వేస్తుండగా ఈ సమస్యను గుర్తించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు విద్యుత్‌శాఖకు తెలియపరిచారు. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ సింహాచలం వివరణ కోరగా మరమ్మతులకు గురైన ప్రదేశంలో బాగు చేయించనున్నట్లు తెలిపారు.

తాగునీటి కోసం ఎదురుచూపులు

- కేఎస్‌పురంలో 396 ఇంటింటి కుళాయిలు
- 50 ఇళ్లకు అందని నీరు
- ఆందోళనలో ప్రజలు



నీరు సరఫరాకాని కుళాయి ట్యాప్‌లు



కేఎస్ పురంలో వాటర్‌ట్యాంక్

సీతానగరం: మండుటెండలో తాగునీటి కోసం అల్లాడిపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని పలుగ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందులోనూ సీతానగరం మండలంలోని కోట సీతారాంపురం కాలనీలో తాగునీరు సరఫరా చేయకపోవడంతో పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్య వివరించినాఎవరూ పట్టించు కోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రభుత్వం గ్రామంలోని 396 ఇళ్లకు ఇంటింటి కుళాయిలను వేసింది. గ్రామంలోని కాంట్రాక్టర్ అన్నివీధుల్లో వేసిన కుళాయిలు వీధుల ఎత్తు,పల్లాలు సరి చూడకుండా భూగర్భంలో పైప్‌లైన్ వేయడం వల్ల ఎత్తుగా ఉన్న కాలనీకి ఆరంభం నుంచి అడపాదడపా తాగునీరు సరపరా అయ్యేదని అంటున్నారు. అరకొరగా తాగునీరు వచ్చినా విద్యుత్ కోతల కారణంగా లోతట్టుగా ఉన్న కుళాయిలకు తాగునీరు వెళ్లడంతో కాలనీ వీధుల్లో 50 కుళాయిలకు తాగునీరు సరఫరా కావడం లేదని రెండు కాలనీల ప్రజలు వాపోతున్నారు. ఎండల తీవ్రత కారణంగా తాగునీటి కోసం అల్లాడుతున్నామని, మంచినీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు..



గ్రామంలో నిరంతరం తాగునీరు సరఫరా చేయడానికి జల్ జీవన్‌మిషన్ పథకం నిధులతో అన్ని ఇళ్లకు ఇంటింటి కుళాయిలు వేశాం. నిర్వహణ లోపం కారణంగా పైప్‌లైన్ మరమత్తులకు గురి కావడంతో నిర్దేశించిన ఇళ్లకు తాగునీరు అందించలేక పోతున్నాం. ప్రస్తుతం ఉన్న మంచినీటి సమస్య పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– ఆర్ పవన్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, సీతానగరం

పట్టించుకోని ప్రభుత్వం

మన ప్రభుత్వం వచ్చిన వెంటనే తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి 10 నెలలు కావచ్చినా ఇంతవరకూ పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. అలాగే కుళాయిల పనులు చేసిన నిర్వాహకులు సక్రమంగా నాణ్యమైన పైప్‌లైన్ వేయకపోవడం వల్ల, ప్రభుత్వం సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోవడం కారణంగా ఓవర్‌హెడ్ ట్యాంక్ వద్ద ఉన్న పంప్ ఆపరేటర్ సకాలంలో నీటిని ట్యాంక్‌కు ఎక్కించక తాగునీటి కోసం కష్టాలు తప్పడంలేదని ఆరోపిస్తున్నారు.

ఆకట్టుకున్న అందమైన ప్రకృతి





పార్వతీపురం అంతర్రాష్ట్ర రహదారిపై నీలి ఆకాశంలో తెల్లని మేఘాలు, సాలూరు మండలం పురోహితుని వలసలో మోడువారిన చెట్టు

పార్వతీపురం రూరల్:

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పార్వతీపురం శివారులో అంతర్‌రాష్ట్ర రహదారిపై నీలిఆకాశంలో అందమైన తెల్లని మేఘాలు వాహనచోదకులను ఆకట్టుకున్నాయి. అలాగే సాలూరు మండలం పురోహితుని వలస సమీపంలో చెరువు గట్టు రహదారిపై ఉన్న మోడు వారిన చెట్టు శిశిర కాలంలో తనకు ఆకులు పూస్తాయని ఎదురుచూస్తున్న దృశ్యం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది.